క్లుప్తంగా

డీజిల్ సరఫరాకు టెండర్లు ఆహ్వానం

తెనాలి అర్బన్: తెనాలి ఆర్టీసీ డిపోలోని బస్సులకు ప్రతిరోజు ఆరువేల లీటర్ల డీజిల్ సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి ఫిబ్రవరి రెండో తేదీ వరకు డిపో ఆవరణలోని మేనేజర్ కార్యాలయంలో టెండర్ ఫారంలు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి రెండో తేదీ మధ్యాహ్నం మూడు గంటలలోపు తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీల్డు బాక్స్‌లో వేయాలని సూచించారు. వివరాలకు 99592 25422, 73829 22295లో సంప్రదించాలని కోరారు.

రంగస్థల కళాకారుడు శివ రామకృష్ణారావుకు సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో శనివారం రౌడీ రాముడు కొంటె కృష్ణుడు ఉచితంగా ప్రదర్శించారు. ఆదివారం చాణక్య చంద్రగుప్త చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ పౌరాణిక, రంగస్థల కళాకారుడు ఆరాధ్యుల శివరామకృష్ణారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో షేక్ అజీజ్, షేక్ గౌస్, దాసరి రాజు, ఆరాధ్యుల రమేష్, గోళ్ల సుబ్రహ్మణ్యం, పెమ్మసాని పోతురాజు, అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, తరణి హేమంత్ కుమార్, నల్లూరి శ్రీనివాస్, ఈశ్వర్‌చంద్ పాల్గొన్నారు.

రేపు శ్రీవిద్యాపీఠంలో శ్రీవాసవీ అమ్మవారి ఆత్మార్పణ

తెనాలి టౌన్: గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో సోమవారం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ మహోత్సవము నిర్వహిస్తున్నట్లు బాలస్వామి శనివారం తెలిపారు. సోమవారం తెల్లవారుజామున శ్రీ వాసవీ మాత సుప్రభాతం సేవ, శ్రీ గణపతి పూజ జరుగుతుందని చెప్పారు.

వృద్ధులకు అన్నదానం

తెనాలి టౌన్: కొల్లావారి వీధిలోని మహాత్మ సేవా శాంతి ఆశ్రమంలో శనివారం సోమరౌతు శ్రీనివాసరావు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు భార్య మృదుల, కుమార్తెలు మోమిత, రుషిమ్రత, చందు వెంకట్రావు, శ్రీనివాసరావు, మొవ్వా వెంకటరాము, ఆశ్రమ నిర్వాహకులు వై.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు

కొల్లిపర: మండల పరిధిలోని వివిధ గ్రామాలల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల ఎంపిక కొరకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 27వ తేదీ వరకు దరఖాస్తు స్వీకరణ, 28న పరిశీలన, 30, 31న మౌఖిక పరీక్ష, ఫిబ్రవరి 1 న వలంటీర్ల ఎంపికైన వారి వివరాలు తెలియజేయటం జరుగతుందన్నారు.

రైల్లో నుంచి జారి పడి వ్యక్తి మృతి

తెనాలి రూరల్: రైల్లో నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం.. తెనాలి– విజయవాడ రైలు మార్గంలోని కొలకలూరు స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి పొదల్లో మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని శనివారం పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుంది. మృతి చెంది మూడు రోజులు అయి ఉంటుందని, రైల్లో నుండి జారి పడి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతక్కిలో ఉచితంగా వైద్య పరీక్షలు

మంగళగిరి: నగర పరిధిలోని నూతక్కిలో కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం, పలు ప్రైవేటు ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 500 మంది రోగులకు బీపీ, షుగరు, ఎముకలు, దంతాలు, కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కేఎల్ విశ్వవిద్యాలయం విద్యార్థి సంక్షేమ అధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, విద్యార్థి వ్యవహారాల సలహాదారు డీన్ డాక్టర్ హబీబుల్లాఖాన్, విద్యార్థి వ్యవహారాల అసోసియేట్ డీన్ డాక్టర్ రూతు రమ్యలు మాట్లాడుతూ ఆసుపత్రులు, వర్సిటీ సంయుక్తంగా దత్తత గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్థానిక ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారథివర్మ, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్ వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె జగదీష్, సాక్ డైరెక్టర్ పి సాయివిజయ్, విద్యార్థుల వ్యవహారాల డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్‌ల తోపాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ప్రజాయుద్ధంలో జగన్‌కు మద్దతునివ్వాలి



పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మర్రి రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యే శివకుమార్‌ను సన్మానిస్తున్న కార్యకర్తలు

తెనాలి: రాష్ట్రంలో పేదలు, సంపన్నులకు మధ్య జరుగుతున్న యుద్ధంలో పేదల పక్షాన నిలబడిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తోడుగా నిలబడి విజయ తిలకం దిద్దాల్సిన కర్తవ్యం పార్టీ నేతలు, కార్యకర్తలు అందరిపైనా ఉందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ కృష్ణా, గుంటూరు జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. స్థానిక గంగానమ్మపేటలోని ఎం కన్వెన్షను హాలులో శనివారం తెనాలి నియోజకవర్గ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి స్థానిక

ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షత వహించారు. ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ విస్తృతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందని గుర్తు చేశారు. అన్ని పథకాలు, పదవుల్లోనూ మహిళలకు ప్రాతినిధ్యం పెంచినట్టు చెప్పారు. కార్పొరేషన్ల ఏర్పాటుతో చిన్నచిన్న కులాలకు గుర్తింపు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతోందని వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అంటే పేదల ప్రభుత్వమని చెబుతూ, మళ్లీ అధికారంలోకి వచ్చినపుడు పేదలకు మరింత న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందుకు పార్టీలోని ప్రతిఒకరూ సీఎంగా జగన్, స్థానిక ఎమ్మెల్యేగా అన్నాబత్తుని శివకుమార్ గెలుపునకు కృషిచేయాలని కోరారు. కృష్ణా, గుంటూరు జిల్లాల మరో ప్రాంతీయ సమన్వయకర్త మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ పేద ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్న ప్రభుత్వం పదికాలాలపాటు ఉండాలన్నదే ప్రజల అభిమతమన్నారు. పార్టీ చేస్తున్న మంచిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అన్ని వర్గాల మద్దతును సమీకరించాలని సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పరిణామాలను విశ్లేషించారు. ప్రజల్లో రాష్ట్ర ప్రభుత్వానికి విశేష మద్దతు ఉందని చెబుతూ పోలింగ్ వరకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులదేనని అభిప్రాయపడ్డారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, కొల్లిపర ఎంపీపీ భీమవరపు పద్మావతి, మున్సిపల్ వైస్‌చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, గుంటూరు కోటేశ్వరరావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, రాళ్లబండి సుష్మ, కావేటి నిర్మల పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు 'అరసం' పోటీలు

తెనాలి: అభ్యుదయ రచయితల సంఘం(అరసం) 19వ మహాసభలు ఫిబ్రవరి 11, 12 తేదీల్లో తెనాలిలో నిర్వహించనున్న నేపథ్యంలో పాఠశాల విద్యార్థులకు శనివారం వివిధ రకాల పోటీలు నిర్వహించారు. స్థానిక తాలూకా జూనియర్ కాలేజీలో 8–10 తరగతుల విద్యార్థులకు జరిపిన 'కథ చెప్పండి', వక్తృత్వం, వ్యాసరచన పోటీలకు మంచి స్పందన లభించింది. మండల విద్యాశాఖ అధికారి మేకల లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహాసభల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి, అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, తెనాలి అధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్ పర్యవేక్షించారు. అయినాల మల్లేశ్వరరావు, షేక్ అస్మతున్నీసా, అలపర్తి వెంకటేశ్వరరావు, వి.లక్ష్మీ, ఎం.అన్నారావు, పి.రవికుమార్, బి.ప్రకాశరావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఆహ్వానసంఘ కార్యవర్గసభ్యులు బొల్లిముంత కృష్ణ, షేక్ అబ్దుల్ హకీంజాని, పి.వెంకటేశ్వరరావు, టి.బాలస్వామి పాల్గొన్నారు. ఆదివారం కాలేజీ విద్యార్థులకు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు వెల్లడించారు.

వేధింపులు కేసులో భర్తకు ఏడాది జైలు శిక్ష

తెనాలి రూరల్: భార్యను కట్నం కోసం వేధించిన కేసులో భర్తకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు..

తెనాలి బాలాజీరావుపేటకు చెందిన షేక్ పర్వీన్‌కు మంగళగిరి సమీపంలోని నవులూరుకు చెందిన గుంటూరు రైల్వే గూడ్సు గార్డు షేక్ అబ్దుల్ సలీమ్‌తో 2018లో వివాహమైంది. భర్త మరో మహిళతో అర్ధరాత్రి ఫోన్లో మాట్లాడుతూ ఉండేవాడు. అదేమని అడిగిన భార్య పర్వీన్‌ని మానసిక, శారీరకమైన బాధలకు గురిచేశాడు. ఇచ్చిన కట్నం చాల్లేదని ఇంకా అదనంగా కట్నం రూ.ఐదు లక్షలు ఆమె పుట్టింటి నుంచి తీసుకురమ్మని వేధించాడు. అంతే కాకుండా పర్వీన్ బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.2.89 లక్షలు తీసుకొన్నాడు. అయినా పర్వీన్‌ని వేధింపులకు గురి చేసి ఇంకొక పెళ్లి చేసుకుంటానని బెదిరించాడు. ఇందుకు అతడి కుటుంబ సభ్యులు సహకరించారు. వేధింపులు భరించలేక పర్వీన్ తెనాలి త్రీ టౌను పోలీసు స్టేషన్‌లో భర్త, అతడి కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేసింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు శుక్రవారం విచారణకు వచ్చింది. అబ్దుల్ సలీమ్‌పై నేరం రుజువు కావడంతో తెనాలి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా, సలీమ్‌కి ఏడాది జైలు శిక్ష, రూ.ఐదు వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. మిగతా వారిపై కేసు కొట్టేశారు. ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్ కుమార్ వాదించారు.

పాఠశాలకు రాని విద్యార్థులను గుర్తించాలి

ఎంఈఓ ఎం.లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

తెనాలి అర్బన్: పాఠశాలకు రాని విద్యార్థులను గుర్తించాలని మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ ఆదేశించారు. మండల పరిధిలోని ప్రధానోపాధ్యాయులతో కొత్తపేటలోని తాలుకా హైస్కూల్‌లో శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు తరచు పాఠశాలలను తనిఖీ చేసే అవకాశం ఉన్నందున్న అందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. సచివాలయ ఉద్యోగుల సహకారంతో విద్యార్థులను పాఠశాలకు వచ్చే విధంగా చూడాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను తప్పనిసరిగా కరెక్షన్ చేయాలని సూచించారు. స్కూల్‌లో ఉన్న పనులను ఉపాధ్యాయులందరూ విభజించుకుని వాటి అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం పాఠశాలకు అందించే ప్రతి సంక్షేమాన్ని విద్యార్థులకు అందేలా చూడాలన్నారు. ఎస్ఎంసీ గ్రాండ్ విడుదల అయిందని, వాటి ద్వారా పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో పలు పాఠశాలల హెచ్ఎంలు డీవీఆర్ ప్రసాద్, జి.శివపార్వతి పాల్గొన్నారు.

సబ్‌జైలు పరిశీలన



సబ్ జైలులో న్యాయమూర్తి శ్రీసీత

తెనాలి రూరల్: స్థానిక సబ్ జైలును రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత శనివారం పరిశీలించారు. జైలు ఆవరణను పరిశీలించి ఖైదీల వసతుల గురించి ఆరా తీశారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, తాగునీటిని పరిశీలించారు. అనంతరం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఖైదీలతో మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పుల వలన జైలుపాలు కావాల్సి వచ్చి ఉంటుందని, ఇకనైనా మారి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తాగునీరు, ఫాగింగ్ విషయమై జైలు సిబ్బందికి సూచనలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మండలపు వేణుగోపాలరావు, ప్యానల్ న్యాయవాది అన్నం పిన్నారావు, పీఎల్‌వీ యర్రంశెట్టి అనిల్‌కుమార్ న్యాయమూర్తితో ఉన్నారు.

రాజీ కాదగ్గ కేసులన్నీ పరిష్కారమయ్యేలా చూడండి

తెనాలి రూరల్: రాజీ అయ్యే అవకాశం ఉన్న కేసులన్నీ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ అయ్యేలా చూడాలని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత సూచించారు. ఫిబ్రవరి 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో పోలీసులతో శనివారం ఆమె సమావేశమయ్యారు. సివిల్, క్రిమినల్, రోడ్డు ప్రమాదాలు, ప్రీ లిటిగేషన్ వంటి కేసులన్నీ పరిష్కారమయ్యేలా కక్షిదారులతో మాట్లాడాలని సూచించారు. సమావేశంలో తెనాలి సబ్ డివిజన్, బాపట్ల జిల్లా వేమూరు, చుండూరు సర్కిళ్ల ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



తెనాలికి చెందిన ప్రవాస భారతీయుడు నిర్వహిస్తున్న అనాథ పిల్లల పాఠశాలకు వచ్చిన ఆస్ట్రేలియన్ ఉపాధ్యాయిని/విద్యార్థులు శనివారం సాయంత్రం ఇలా చీరల్లో ముస్తాబయ్యారు. వీరితో ఎన్నారై ప్రొఫెసరు డాక్టర్ అత్తోట విద్యాసాగర్, పొఫెసర్ సియాన్ క్లేర్నే ఉన్నారు.

– తెనాలి

సాయి సత్సంగ కేంద్రం వార్షికోత్సవం



తెనాలి టౌన్: రామలింగేశ్వరపేటలోని సద్గురు సాయినాథుని సత్సంగ కేంద్రం 31వ వార్షికోత్సవ వేడుకలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం సత్సంగ కేంద్రం నుంచి మయూర వాహనంపై ఉత్సవమూర్తులను ఉంచి ఊరేగించారు. ప్రత్యేక ఆకర్షణంగా శ్రీ వెంకటేశ్వర మురళీకృష్ణ సభ్యులు కోలాటం సభ్యులు (తూములూరు) చేసిన ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. రాత్రి టీజీకే కల్యాణ మండపంలో మయూర మండపంలో స్వామిని విడిదిగా ఉంచారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కన్వీనర్లు వీఎస్ నాగభూషణంరెడ్డి, టి.జి.కృష్ణ పర్యవేక్షించారు.

మూలాంకురేశ్వరికి ఖడ్గమాలపూజలు

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి అమ్మవారికి పాల్గుణ బహుళ అమావాస్యను పురస్కరించుకొని అర్చకులు అయ్యన్న శాస్త్రి శనివారం విశేషపూజలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకంచేసి నూతనవస్త్రాలతో అలంకరించారు. దుర్గాఅష్టోత్తర, సహస్రనామాలతో కుంకుమార్చనలు చేశారు. మండపంలోని అమ్మవారి పాదుకలకు దేవీస్తోత్రాలతో ఖడ్గమాలపూజలు నిర్వహించి అఖండహారతి సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

యూపీహెచ్‌సీ వైద్యునిగా రాజేష్ బాధ్యతల స్వీకారం

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యునిగా డాక్టర్ రాజేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ వైద్యునిగా విధులు నిర్వర్తించిన డాక్టర్ సయ్యద్ ముస్తఫా గత నెల 21వ తేదీన నిజాంపట్నం క్లస్టర్‌కు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో 104 విభాగంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రాజేష్ యర్రబాలెం యూపీహెచ్‌సీకి బదిలీపై వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రాజేష్‌కు ఎంపీహెచ్‌ఈఓ మనోహర్‌తోపాటు పలువురు వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడు చాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశం

మంగళగిరి: నగరంలోని మెయిన్ బజారు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 11 గంటలకు ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు సంకా బాలాజీ గుప్తా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జీఎస్టీ చట్టంలో వచ్చిన నూతన మార్పులు, ఆచరణాత్మక ఇబ్బందుల గురించి సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్‌జీఎస్‌టీ జాయింట్ కమిషనర్ మధుబాబు, అసిస్టెంట్ కమిషనర్ కోట శ్రీధర్, సూపరింటెండెంట్ ఆఫ్ సీజీఎస్‌టీ బి.కుమార్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

23న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

సీపీఎం జిల్లా కార్యదర్శి పి.రామారావు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. శనివారం పట్టణ పరిధిలోని బోటుయార్డు వద్ద గల పుష్కర కాలనీ, సీతానగరం, కెఎల్‌రావు కాలనీ ప్రాంతాల్లో సీపీఎం నాయకులతో కలసి ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ 2016 పుష్కరాల సందర్భంగా ఘాట్లు, రోడ్ల నిర్మాణం కోసం ఇళ్లు తొలగించిన సుమారు 300 మంది పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇంతవరకు కేటాయించలేదని అన్నారు. పుష్కర బాధితుల కాలనీలో మురుగు నీటి సమస్యను పరిష్కరించి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కేఎల్ రావు కాలనీలో కల్వర్టు పూడిక తీయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం తాడేపల్లి పట్టణ నాయకులు కొట్టే కరుణాకరరావు, సోలా ముత్యాలరావు, దొంతిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, కట్టా మేరి, వెంపాటి శామ్యూల్ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 20వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

తెనాలి అర్బన్: రాజకీయ పార్టీ, కులం, మతం చూడకుండా అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అందిస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 20వ వార్డు కొత్తవంతెన సమీపంలో శనివారం నిర్వహించారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అందుకున్న ప్రతి ఒక్కరూ కృతజ్ఞత భావంతో తమను ఆదరిస్తున్నారని చెప్పారు. 20వ వార్డులో ఇప్పటి వరకు రూ.8.88 కోట్లతో సంక్షేమ ఫలాలు అందించినట్లు చెప్పారు. ప్రభుత్వం సంక్షేమం ఇచ్చే విషయంలోనూ, ప్రజల గ్రీవెన్స్‌ను పరిష్కరించే విషయంలోనూ చిత్తశుద్ధితో పనిచేస్తుందని భరోసా ఇచ్చారు. రానున్న నాలుగు నెలల్లో రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 20వ వార్డు నాయకులు కొల్లా గురునాథ్ గుప్తా, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, కౌన్సిలర్లు గడవర్తి సాయిహరేరామ్, ఆవుల కోటయ్య, 20వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు గోల్డ్ రహిమా, దామర్ల విజయరాణి, షేక్ జాకీరా, బైన శ్రీను, కొమ్మూరు కిరణ్, షేక్ గఫార్, శనగపల్లి నాగేశ్వరరావు, కనమర్లపూడి సుబ్రహ్మణ్యం, ఏలూరి శేషగిరిరావు, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు భాస్కరుని శ్రీనివాసరావు, మద్దాలి శేషాచలం, ఎన్ఆర్‌కే శర్మ, చందు సాయి పాల్గొన్నారు.

ముగిసిన విద్యుత్ నియంత్రణ మండలి ప్రజాభిప్రాయసేకరణ



వివరాలు తెలియజేస్తున్న ఈఈ చిరంజీవి

తెనాలి టౌన్: రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 19 నుంచి 20వ తేదీ వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ప్రజాభిప్రాయసేకరణ ముగిసినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ చిరంజీవి తెలిపారు. డివిజన్ కార్యాలయంలో శనివారం వివరాలు వెల్లడించారు. విశాఖపట్నం నుంచి మూడు రోజుల పాటు విద్యుత్ సంస్థలోని మూడు డిస్కమ్‌ల చైర్మన్లు, డైరెక్టర్లు 2023–24 ఆర్థిక సంవత్సరానికి టారిఫ్ ఎలా ఉండాలి, వినియోగదారుల సమస్యలపై మాట్లాడినట్లు చెప్పారు. వివిధ రకాల వినియోగదారులు పాల్గొని వారి అభిప్రాయాలు, ధరలు పెంపు వద్దని, వ్యవసాయానికి విద్యుత్ మీటర్లు పెట్ట వద్దని ఎక్కువ మంది కోరినట్లు వివరించారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులందరికి ప్రభుత్వ సబ్సిడీ వర్తింపజేయాలని, ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50లకు ఇవ్వాలని కోరినట్లు ఈఈ పేర్కొన్నారు. వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని లోక్ సత్తా నుంచి శరత్ చంద్ర కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఈ చిరంజీవితో పాటు డీఈఈ అశోక్‌కుమార్, టెక్నికల్ ఏఈ సుధీర్, ఏఈ ఇస్మాయిల్ బేగ్ పాల్గొన్నారు.

23 నుంచి 27వ తేదీ వరకు ఖోఖో, క్రికెట్ పోటీలు



పోటీలకు సంబంధించిన కరపత్రాలు ప్రదర్శిస్తున్న స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు

కొల్లిపర: అవుతు రామిరెడ్డి మెమోరియల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు నియోజకవర్గం స్థాయిలో ఖోఖో, క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు అవుతు కృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలు నియోజకవర్గంలోని ప్రభుత్వం గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో 15సంవత్సరాల లోపు విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని, ప్రతి పాఠశాల నుంచి ఒక టీమ్ మాత్రమే పాల్గొన్నాలని పేర్కొన్నారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ వీరనారాయణ మాట్లాడారు. వివరాలకు 9494498304, 9440373048, 8121318131 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల మాజీ ప్రిన్సిపాల్ వింత మోహన్‌రెడ్డి, అక్షయ్ పాల్గొన్నారు.

మిద్దె పంటల పెంపకంతో రసాయన రహిత కూరగాయలు

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై మహిళలకు అవగాహన



లాంలో మిద్దెతోటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం సభ్యులు

లాం(తాడికొండ): ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో రసాయన రహితంగా ఇంటి వద్దనే రసాయన రహితంగా కూరగాయలు పండించడం ద్వారా మంచి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం యూనిట్ ఇన్‌ఛార్జి ఝాన్సీలక్ష్మి అన్నారు. శనివారం తాడికొండ మండలం లాం గ్రామంలోని లాలాది వెంకటకుమారి గృహంపై రసాయన రహితంగా పండించిన మిద్దె తోటను పలువురు గ్రామస్తులతో కలిసి ఆమె పరిశీలించారు. ఎలాంటి రసాయనాలు లేకుండా తమ పర్యవేక్షణలో పురుగుమందులు బదులుగా కషాయాలు, ఘన, ద్రవ జీవామృతాలు వాడి విషరహిత ఆహారాన్ని అందరూ తీసుకోవచ్చనే విషయం పలువురికి వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ విధానాలను పాటించేలా సమగ్ర అవగాహన కల్పించే దిశగా తమ ప్రకృతి వ్యవసాయ విభాగం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో టీఆర్పీలు నాగరాజు, ఐసీఆర్పీలు పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

మంగళగిరి: ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం శివకామేశ్వరి దేవాలయం సమీపంలో చోటుచేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... రేపల్లెకు చెందిన కొలసాని చైతన్య, మహాలక్ష్మి(35) దంపతులు ఆరేళ్ల కిందట బతుకుదెరువు నిమిత్తం యర్రబాలెం వలస వచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలు. వేప చెట్టు సెంటర్‌లో టిఫిన్ హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. గత కొంతకాలంగా మహాలక్ష్మి మానసిక వ్యాధితో బాధపడుతోంది. టిఫిన్ హోటల్‌ను నిలిపివేసి ఆమెకు ప్రత్యేక వైద్యం చేయిస్తున్నాడు. కాలక్రమేణా మహాలక్ష్మి ఆరోగ్యం కుదుటపడటంతో నగరంలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంబడి చైతన్య టిఫిన్ హోటల్‌ను తిరిగి నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు చోటుచేసుకోవడంతో శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మంగళగిరి రూరల్ ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీనివాసరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.